## క్లుప్తంగా

### విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. శివరాంపల్లి ఎన్‌పీఏ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. శాస్త్రీపురం విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోత ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### తారకరత్నకు నివాళి



రాజేంద్రనగర్: సినీ నటుడు నందమూరి తారకరత్న మరణం టీడీపీకి తీరని లోటు అని ఆ పార్టీ నాయకుడు మ్యాడం రామేశ్వర్ అన్నారు. హైదర్‌గూడ చౌరస్తాలో తారకరత్న చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సనివెల్లి చంద్రశేఖర్‌రెడ్డి, సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ అయామ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేడు జీవరసాయనాలు, జీవన ఎరువులు, జీవ ఉత్తేజకాలను మొక్కల పోషణకు వినియోగించుకోవడంపై నేడు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత కాలంలో సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ అనుకూల వ్యవసాయం, హానికర మందులకు బదులుగా ఇతర ప్రయోగాలు చేస్తామన్నారు. ఈ శిక్షణలో సీనియర్ శాస్త్రవేత్తలు విద్యార్థులకు సూచనలు చేస్తారని చెప్పారు.

### ప్రత్యేక అలంకరణలో శివాలయం



రాజేంద్రనగర్: అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయాన్ని ఆదివారం వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ప్రతి సంవత్సరం శివరాత్రి మరుసటి రోజున దేవాలయాన్ని పూలతో అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో ఈ అలంకరణ కార్యక్రమం నిర్వహించారు.

### పేకాట ఆడుతున్న వ్యక్తుల రిమాండ్

మణికొండ: ఓ నిర్మాణ సంస్థ లేబర్ క్యాంప్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని రాజేంద్రనగర్ జోన్ ఎస్‌ఓటీ, నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. కోకాపేటలోని జేఎంసీ ప్రాజెక్ట్స్ లేబర్ క్యాంప్‌లో శనివారం రాత్రి కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,76,490 నగదు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

# వసూళ్లలో 'మేజర్' వెనుకంజ

- ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడిన మేజర్ పంచాయతీలు
- చిన్న పంచాయతీల్లో అధిక శాతం వసూళ్లు
- మార్చితో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం
- వసూళ్లలో వేగం పెంచిన అధికారులు



వంద శాతం ఆస్తి పన్ను వసూలైన పిల్లోనిగూడ పంచాయతీ కార్యాలయం

శంషాబాద్ రూరల్: ఆస్తి పన్ను వసూళ్లలో మేజర్ పంచాయతీలు వెనుకంజలో ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో వంద శాతం పన్ను వసూళ్లు పూర్తయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 40 రోజులు ఉండగా మండలంలో ఇప్పటి వరకు 80 శాతం పన్ను వసూలు చేశారు.

- మండల పరిధిలోని 27 పంచాయతీల్లో పాల్మాకుల, నర్కూడ, పెద్దషాపూర్ మేజర్ పంచాయతీలుగా ఉన్నాయి. వీటిలో పన్నుల వసూలు 76 శాతం మించలేదు. పైగా గత ఏడాది వసూలు చేయాల్సిన పన్నులు(ఎరియల్స్) రూ.లక్షల్లో బకాయి ఉన్నాయి.
- కొత్తగా ఏర్పడిన అలీకోల్‌తండా, పిల్లోనిగూడలో వంద శాతం వసూలు కాగా.. రషీద్‌గూడలో 94 శాతం, మదన్‌పల్లి పాతతండాలో 93 శాతం వసూలు చేశారు.
- మొత్తం 27 పంచాయతీల్లో 13,834 ఇళ్లకుగాను ప్రసుత ఆర్థిక సంవత్సరానికి రూ.2,28,76,771 వసూలు చేయాల్సి ఉంది. వీటికి తోడు గత ఏడాది బకాయిలు రూ.14,35,421 ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు గత బకాయిల్లో రూ.3,25,473 వసూలు చేశారు. ఈ ఏడాది ఆస్తి పన్ను రూ.1,86,78,245 వసూలు అయ్యాయి. నర్కూడ పంచాయతీలో ఎక్కవ శాతం బకాయిలు ఉన్నాయి.
- అత్యల్పంగా బహదూర్‌గూడలో కేవలం రూ.58 శాతం పన్నులు వసూలు చేశారు. మదన్‌పల్లిలో రూ.63 శాతం కాగా.. మేజర్ పంచాయతీ నర్కూడలో 66 శాతం మాత్రమే వసూలు చేశారు.

### వంద శాతం వసూళ్లకు కృషి



పంచాయతీల్లో వంద శాతం పన్ను వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ఆన్‌లైన్ వసూళ్లతో కలిపి 80 శాతానికి చేరుకున్నాం. బకాయిలతో పాటు ఈ ఏడాది ఆస్తి పన్నుల వసూళ్ల కోసం పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశాం.

– ఎం.ఉషాకిరణ్‌రెడ్డి, ఎంపీఓ, శంషాబాద్

# కొత్వాల్‌గూడలో ఘనంగా మల్లన్న జాతర



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. కొత్వాల్‌గూడలో మల్లికార్జున భ్రమరాంబ, కేతమ్మ, ఎల్లమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవానికి ఆదివారం సాయంత్రం కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంప్రదాయ మహోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. కొత్వాల్‌గూడలో జరిగే మల్లన్న జాతర మహోత్సవం ప్రత్యేకమైందన్నారు. అంతకుముందు మల్లన్న కల్యాణం, నాగవెల్లి కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆర్.గణేష్‌గుప్తా, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, పి.సిద్దేశ్వర్‌గౌడ్, నీరటి రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్ షర్మిలను అరెస్ట్ చేయడం దురదృష్టకరం



శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ఒక మహిళ గురించి అభ్యంతరకరంగా మాట్లాడిన ఎమ్మెల్యేను అరెస్టు చేయకుండా ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం దురదృష్టకరమని రాజేంద్రనగర్ నియోజకవర్గ వైఎస్‌ఆర్‌టీపీ యువజన విభాగం కన్వీనర్ సదాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై, ఎమ్మెల్యే ఇచ్చిన హామీల గురించి బహిరంగ సభలో వైఎస్ షర్మిల ప్రశ్నించారని, ఈ విషయంలో ఆమెను అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేను అరెస్టు చేసే బదులు వైఎస్ షర్మిలను అరెస్టు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం బీఆర్‌ఎస్ పార్టీకి అలవాటైందన్నారు. అరెస్టులు, కేసులతో భయపడేది లేదన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

### రెజ్లింగ్ కోచ్‌కు సన్మానం

మణికొండ: ఖేలో ఇండియా రెజ్లింగ్ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి పతకాలను సాధించడంలో కోచ్ శ్రీకాంత్‌యాదవ్ కృషి ఎనలేనిదని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు క్యాతం అశోక్‌యాదవ్ అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున అత్యధిక పతకాలను సాధించడంతో ఆదివారం ఆయన శ్రీకాంత్‌ను సన్మానించి రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి పతకాలు మరిన్ని సాధించాలని ఆయన సూచించారు.



శ్రీకాంత్‌యాదవ్‌ను సన్మానిస్తున్న అశోక్‌యాదవ్

## సమస్యను పరిష్కరించాలని ఎంపీకి వినతి



ఎంపీ రంజిత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అలకాపూర్ వాసులు

మణికొండ: ప్రజలు స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకున్న తర్వాత దేవాదాయ శాఖ అధికారులు ఆ భూమి తమదంటూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ మాజీ అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని, అక్కడ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆదివారం తుల్జారాం లేఅవుట్ బాధితులతో పాటు అలకాపూర్ టౌన్‌షిప్ వాసులు ఆయన నివాసంలో కలిసి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే దేవాదాయ, మున్సిపల్ శాఖల అధికారులతో మాట్లాడిన ఎంపీ ప్రజలు గృహాలు నిర్మించుకునే సమయంలో లేని అభ్యంతరాలు వారు తిరిగేందుకు వేసుకునే రోడ్లపై ఎందుకని ప్రశ్నించారు. వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నక్షత్ర అపార్ట్‌మెంట్ సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు నరేంద్ర, దిలీప్, తేజ, విజయ్, సల్మాన్, కామేశ్వర్‌రావు, సూర్య, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీలోకి చేరికలు

గచ్చిబౌలి: గిరిజనుల అభ్యున్నతికి తమ పార్టీ కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని చంద్రానాయక్‌తాండలో బీజేపీ నాయకుడు రాధాకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. గిరిజనులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు తమ పార్టీ ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గిరిజన మహిళను రాష్ట్రపతిని చేయడం బీజేపీకి మాత్రమే సాధ్యమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ హయాంలో చంద్రానాయక్‌తాండలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. బీజేపీలో చేరిన వారిలో సునీల్‌సింగ్, శివ, సంతోష్, సిద్ధు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, జైస్వాల్ నరేష్ తదితరులు ఉన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణం

రాయదుర్గం: అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్ హిల్స్ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు పనులను శనివారం రాత్రి ప్రారంభించి తెల్లవారుజాము వరకు పనులు చేసినట్లు అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్ ఆదేశాల మేరకు వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో పనులు పూర్తి చేశారు.

### వైభవంగా శివపార్వతుల కల్యాణం



చిత్రపురి సత్సంగ సమాజం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని మణికొండ పార్వతీరామలింగేశ్వరాలయం, మంచిరేవుల మచిలేశ్వరస్వామి దేవాలయం, చిత్రపురి సత్సంగ సమాజం ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని స్మరిస్తూ జాగరణలో పాల్గొన్నారు. మంచిరేవులలో జాగరణ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

### 20 నుంచి వాటర్ పోలో చాంపియన్‌షిప్



వివరాలు వెల్లడిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

గచ్చిబౌలి: గచ్చిబౌలి స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 20 నుంచి 2వ జాతీయ వాటర్ పోలో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటాయని, నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, బెంగళూర్, జైపూర్‌తో పాటు పలు రాష్ట్రాల జట్లు పాల్గొంటాయని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్, చీఫ్ ప్యాట్రన్ కొండా విజయ్‌కుమార్, సమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దేవర కరుణాకర్ విగ్రహావిష్కరణ

గోల్కొండ: గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ నిర్వహించిన సేవా కార్యక్రమాలను మున్ముందు కూడా కొనసాగిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం దేవర కరుణాకర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనతో పాటు దేవర వంశీ తదితరులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

### ఉత్సాహంగా కుస్తీ పోటీలు

గోల్కొండ: ఛత్రపతి శివాజీ మహరాజ్ దేవర కరుణాకర్ మెమోరియల్ కుస్తీ పోటీలు జోరుగా సాగుతున్నాయి. మల్లయోధులు నువ్వా నేనా అన్నట్లుగా ఒకరిపై ఒకరు ఎత్తులు వేసుకుంటున్నారు. జూనియర్, సీనియర్, సబ్-జూనియర్ విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీలు గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెహిల్వాన్‌లు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

### యువత క్రీడల్లో రాణించాలి

మణికొండ: యువత ఖాళీ సమయాన్ని వృధా చేయకుండా ఆటలకు వినియోగించుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో శివరాత్రి పండుగను పురస్కరించుకుని బీఆర్‌ఎస్ నాయకుడు హరిశంకర్ ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. అనంతరం కరాటే పోటీల విజేతలకు వారు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే తమకు నచ్చిన క్రీడను ఎంచుకుని అందులో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆర్.నర్సింహ, రవి, విశ్వనాథ్, గణేష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీతోనే ప్రజల కష్టాలు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌రాజ్

శంషాబాద్: రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. ప్రజా గోస-బీజేపీ భరోసా పేరిట పట్టణంలోని బృందావన్ టౌన్‌షిప్ వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తుంటే సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారన్నారు. స్వరాష్ట్రం సాధించిన తర్వాత తీరాల్సిన కష్టాలు మరింత పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శ్రీధర్, రాష్ట్ర నాయకుడు సెవెళ్ల మహేందర్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు కె.ప్రశాంత్, రమేష్, జితేందర్, భాస్కర్‌రెడ్డి, చింటు తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

మణికొండ: ఓ ఆశయం, తన వారిని రక్షించుకోవడం, హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించుకోవాలనే ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను సంఘటితం చేసి చరిత్రలో నిలిచిపోయిన శివాజీని ప్రతి యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఛత్రపతి శివాజీ జన్మదినం సందర్భంగా ఆయన నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్‌లో జరిగిన వేడుకలు, ర్యాలీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బానిసత్వాన్ని రూపుమాపి తమ పాలన తామే చేసుకుంటామనే నినాదంతో పోరాటం చేసి సత్తా చాటిన వ్యక్తి శివాజీ అన్నారు. ఆయన అడుగు జాడల్లో పయనించి రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

**అత్తాపూర్ డివిజన్‌లో..**

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతృభూమి పరాయి పాలకుల చేతిలో బంధీ అయిందని బెబ్బులిలా కదనరంగంలో దూకిన మహావీరుడు ఛత్రపతి శివాజీ అన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, బీటాకురి సిద్దేశ్వర్, కాకుళారం కృష్ణ, కుక్కునూరి కిరణ్‌చారి, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లిలో..**

మైలార్‌దేవ్‌పల్లి: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బృందావన్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, గగన్‌పహాడ్, అత్తాపూర్ రామ్‌మందిర్, శంషాబాద్ ఆలీకోల్‌తండా, సుల్తాన్‌పల్లి, శంషాబాద్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభయాత్రలో ఆయన పాల్గొన్నారు.

**శివాజీ విగ్రహావిష్కరణ**

శంషాబాద్ రూరల్: మండలంలోని అలీకోల్‌తండాలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. వివిధ పార్టీల నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

# ఖాజాగూడ రోడ్డు.. ఇకపై మోడల్ కారిడార్



మోడల్ కారిడార్‌గా అభివృద్ధి చేయనున్న రహదారి

రాయదుర్గం: ప్రస్తుతం మోడల్ రోడ్డుగా ఉన్న రహదారిని మోడల్ కారిడార్‌గా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని దాబా కూడలి నుంచి మధురానగర్, ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ ఔటర్ రింగ్‌రోడ్డు అండర్ బ్రిడ్జి వరకు ఉన్న మోడల్ రోడ్డును మోడల్ కారిడార్‌గా మార్చేందుకు అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా రెండు రోజుల క్రితం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ అధికారులు ఇక్కడ పర్యటించారు. దీంతో మోడల్ కారిడార్ పనులు త్వరలోనే ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే మెట్రో అధికారులు సైతం ఈ రోడ్డును పరిశీలించి ప్రస్తుత సెంట్రల్ డివైడర్‌పైనే మెట్రో పిల్లర్లు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టుదలతో ఉండడంతో కారిడార్ పనులు ఊపందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

**ప్రత్యేక ఆకర్షణగా సైకిల్‌ట్రాక్..**

ఖాజాగూడ రోడ్డును మరింత ఆకట్టుకునేలా రూ.11 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. అందులో భాగంగా ఇరువైపులా సైకిల్‌ట్రాక్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. టోలిచౌకి, రాయదుర్గం మీదుగా దాబా కూడలి నుంచి ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు ఐటీ, ఇతర ఉద్యోగులు సైకిల్‌పై వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్రో రైలు పనులు ప్రారంభించకముందే సైకిల్‌ట్రాక్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఇప్పటికే రూ.45 కోట్లతో రోడ్డు నిర్మాణం..**

దాబా కూడలి నుంచి మధురానగర్, ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ ఔటర్ రింగ్‌రోడ్డు అండర్ బ్రిడ్జి నుంచి విప్రో సర్కిల్ వరకు ఉన్న రోడ్డును విస్తరించి డివైడర్, లైటింగ్ ఏర్పాటు చేయడంతో దీనిని మోడల్ రోడ్డుగా పేర్కొన్నారు. 2.7 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డును రూ.45 కోట్లతో నిర్మించారు. మొదట్లో 8 లేన్ల రహదారి నిర్మాణం చేపట్టాలని భావించినప్పటికీ భూ సేకరణలో సమస్య కారణంగా ఆరులేన్ల ప్రధాన రోడ్డు, ఇరువైపులా డ్రైనేజీ, ఆ తర్వాత సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అయితే కొన్ని చోట్ల మాత్రమే ఆరులేన్ల రోడ్డు నిర్మించి డివైడర్, గ్రీనరీ, లైటింగ్ ఏర్పాటు చేశారు.

- రోడ్డును పూర్తిగా విస్తరించాలంటే ఇరువైపులా మరింత భూసేకరణ చేయాల్సి ఉండడంతో ఇప్పటి వరకు చేసిన పనులతోనే సరిపెట్టారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ప్రత్యేక చొరవతో నగరంలో ఎక్కడా లేని విధంగా శ్మశానవాటికల స్థలాలను సైతం సేకరించి ఈ రోడ్డును పూర్తి చేశారు. ప్రస్తుతం ఫుట్‌పాత్‌లు, సైకిల్ ట్రాక్‌ల నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం ఉన్న ఆరు లేన్ల రోడ్డు 8 లేన్లకు మార్చే అవకాశం ఉండకపోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సైకిల్‌ట్రాక్, ఫుట్‌పాత్ నిర్మాణంతో పాటు మెట్రో సౌకర్యం కల్పిస్తే ఈ రోడ్డు రద్దీగా మారే అవకాశం ఉంది.